క్లుప్తంగా

టీటీడీ చైర్మన్ భూమనకు సత్కారం



భూమనను సత్కరిస్తున్న మంత్రి రోజా

నగరి : తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని మంత్రి ఆర్‌కే రోజా ఆమె సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి దుశ్శాలువ, గజమాలలతో ఘనంగా సత్కరించారు. తిరుమల బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడానికి భూమన గురువారం నగరిలోని మంత్రి ఆర్కేరోజా స్వగృహానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మంత్రి రోజా ఆయనను ఘనంగా సత్కరించారు.

ఆహా క్యాంటీన్ ప్రారంభం



పుత్తూరులో ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

పుత్తూరు రూరల్: తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం అందించే ఆహా క్యాంటీన్‌ను గురువారం వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పనుల నిమిత్తం పుత్తూరు పట్టణానికి వచ్చే పేదవారి కోసం ప్రభుత్వం మెప్మా ఆధ్వర్యంలో ఆహా క్యాంటీన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేవలం రూ.20కే పెరుగన్నం, రూ.25కు పులిహోర, వెజిటబుల్ రైస్ అందించడం జరుగుతుందన్నారు. అందరికీ అందుబాటులో ఉండే విధంగా నగరం రోడ్డు సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఈ క్యాంటీన్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కెఎల్ఎన్‌రెడ్డి, చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్ డి.జయప్రకాష్, మెప్మా సిటీ మేనేజర్ ప్రమీళ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

వంగ తోటల పరిశీలన

నింద్ర: వంగ తోట సాగు చేసిన రైతులు పంటలో సస్యరక్షణ తప్పనిసరిగా చేపట్టాలని మండల వ్యవసాయాధికారి తులసిరాం అన్నారు. గురువారం మండలంలోని అగరం గ్రామంలో వంగ పంటలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఆయన మాట్లాడారు. వంగ సాగు చేసిన పదిరోజులకు ఒకసారి తోటలో సస్యరక్షణ చేపట్టాలని సూచించారు. వర్షాలు పడుతుండడం వల్ల పంటకు చీడపీడలు సోకే అవకాశం ఉందని, అందువల్ల తోటలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతులు, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వర స్వామి

నింద్ర: మండలంలోని నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ వద్ద ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు స్వామివారికి నిత్య కైంకర్యాలతో పాటు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. సాయంత్రం తిరుమలకు కాలినడక వెళ్తున్న భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు గాజంకిలో గడప గడపకు..

కార్వేటినగరం: మండలంలోని గాజంకి సచివాలయ పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కొనసాగుతుందని మండల కన్వీనర్ శేఖర్‌రాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. గాంజికి సచివాలయ పరిధిలోని రైతువానిగుంట గ్రామం నుంచి ఉదయం 6.30 గంటల నుంచి నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకం అవుతారని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తూ, గ్రామాల్లో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తారని తెలిపారు.

నాడు-నేడు పనుల పరిశీలన



అధికారులకు సూచనలు ఇస్తున్న డీఈఓ శేఖర్

పుత్తూరు రూరల్: మండల పరిధిలోని పరమేశ్వరమంగళం ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను గురువారం డీఈఓ శేఖర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సూచనల మేరకు భద్రత ఏర్పాట్ల మధ్య పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. ఆయన వెంట ఎంఈఓ తిరుమలరాజు ఉన్నారు.

అన్ని విధాలా ఆదుకుంటున్నాం

- అవసరాల కోసం వచ్చేదెవరో ప్రజలకు బాగా తెలుసు
- ఎవరు మంచి చేస్తున్నారో ప్రజలు గమనిస్తున్నారు
- సంక్షేమ పథకాలతో అర్హత ఉన్న వారికి మేలు చేశాం
- మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకే గడప గడపకు వెళ్తున్నాం
- మంత్రి ఆర్కే రోజా



జంబాడలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

విజయపురం (నగరి) : సంక్షేమ పథకాలు అందించి ప్రజలను అన్ని విధాలా ఆదుకుంటున్నామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. గురువారం ఆమె మండలంలోని జంబాడ, ఆదిఆంధ్రవాడ గ్రామాల్లో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు గజమాలలు, దుశ్శాలువలతో హారతులు పట్టి ఆమెను ఆహ్వానించారు. మండల స్థాయి అధికారులతో కలసి ప్రతి గడపకు పర్యటించిన ఆమె నాలుగేళ్లలో ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని స్థానిక ప్రజలకు వివరిస్తూ సంక్షేమ బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రజలకు సంక్షేమ పథకాలను అందించి అన్ని విధాలా తోడుగా ఉంటున్నామని తెలిపారు. తనపై నమ్మకంతో గెలిపించిన ప్రజలకు మంచి చేయడం సంతోషంగా ఉందన్నారు. తాము చేపడుతున్న అభివద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమం రికార్డు పూర్వకంగా చెప్పగలమని, గతంలో పద్నాలుగేళ్ల టీడీపీ పాలనలో వారు చేసిన అభివృద్ధి పనులు చెప్పగలరా ? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నాలుగున్నరేళ్లలో వందశాతం అమలు చేసిన ఘనత ఒక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకే దక్కుతోందన్నారు. అందుకే ప్రతి గ్రామంలో కూడా గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటున్న మాకు ఘనస్వాగతం పలుకుతున్నారని తెలిపారు.

ప్రతి గడపలో ఆదరణే

అర్హతే ఆధారంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగనన్నదే అని మంత్రి రోజా అన్నారు. ఎవరు మంచి చేస్తున్నారో ప్రజలు గ్రహిస్తున్నారని, అండగా నిలిచేదెవరో అవసరాల కోసం వచ్చేదెవరో ప్రజలకు బాగా తెలుసన్నారు. ప్రతి గడపలో లభించే ఆదరణే అందుకు నిదర్శనమన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం ఖాయమని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ, కన్వీనర్ గోపి, సింగిల్‌విండో అధ్యక్షుడు హరి, నార్పరాజు, సర్పంచ్ భాస్కర్‌రాజు, కుమార్, ప్రసన్న, గోపి, నాయకులు పాల్గొన్నారు.



అనారోగ్యంతో బాధ పడుతున్న వ్యక్తిని పరామర్శిస్తున్న మంత్రి రోజా

బాధిత కుటుంబాలకు భరోసా



నాగమ్మ మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి గురువారం మండలంలో వివిధ కారణాల వల్ల మృతి చెందిన బాధిత కుటుంబాలను పరామర్శించి భరోసా కల్పించారు. గురువారం ఆయన ఈస్టు ఏఏడబ్ల్యూ, కొల్లాగుంట గ్రామాల్లోని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదరికంతో అల్లాడుతూ బుట్టలు అల్లి కష్టపడి పిల్లలను విదేశాల్లో ఉన్నత చదువులు చదివించాడని, అలాంటి ప్రాణ స్నేహితుడు దేశయ్య మృతి చెందడం బాధాకరమన్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చి ఆర్థికసాయం అందించారు. అదేవిధంగా కొల్లాగుంట దళితవాడకు చేరుకున్న ఆయన వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజా కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబాన్ని ఓదార్చి అన్నివిధాలా అండగా ఉంటానని వారికి హామీ ఇచ్చారు. ఆయన వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, సర్పంచ్‌లు ధనంజయవర్మ, దివ్య, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓ మోహన్‌మురళి, నాగభూషణం, సురేష్‌బాబురెడ్డి, దీపక్‌రెడ్డి, నాయకులు శేషాద్రి, మాజీ ఏఎంసీ చైర్మన్ కృష్ణయ్యయాదవు, వెంకటరత్నం, గాంధీ, చందురాజు పలువురు పాల్గొన్నారు.



దేశయ్య కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

యనమలమందలో..

వెదురుకుప్పం: మండలంలోని యనమలమంద గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగరాజు కుటుంబాన్ని ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి పరామర్శించారు. నాగరాజు తల్లి నాగమ్మ(70) అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న మంత్రి గురువారం యనమలమంద గ్రామంలో పర్యటించి నాగమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బట్టే సుబ్రమణ్యం, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, నాయకులు ధనుంజయరెడ్డి, రామచంద్రారెడ్డి, హరినాథ్, దాము ఉన్నారు.

సూక్ష్మ పోషకాల యజమాన్యంపై అవగాహన



తెగుళ్ల నివారణకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని

పాలసముద్రం : పంటల దిగుబడులను సుస్థిర పరచడానికి సూక్ష్మ పోషకాల ఆవశ్యకతపై రైతులు అవగాహన పెంచుకోవాలని డీఆర్‌సీ–డీటీసీ వ్యవసాయ సంచాలకులు టీవీ నాగపద్మిని తెలిపారు. గురువారం ఆమె వెంగళరాజుకుప్పంలో ఏఓ డిల్లీప్రసాద్‌తో కలిసి పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వేరుశనగ సాగు, సూక్ష్మ పోషకాల యజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులతో టీవీ నాగపద్మిని మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి ఎరువులే కాకుండా సూక్ష్మ పోషకాలైన జిప్సం, బోరాన్, మొదలైన ఎరువులు వినియోగించడంపై పూర్తిస్థాయిలో వివరించారు. వేరుశనగ సాగు చేసిన పంటకు తెగుళ్ల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వేరుశనగ పంటకు ఆకుముడత, ఆకుపచ్చ, లద్దె పురుగు సోకుతాయన్నారు. వీటి నివారణకు ప్రొఫెనపాస్ 2 ఎంఎల్‌ను లీటర్ నీటిలో కలిపి ఎకరానికి 200 లీటర్లు పిచికారీ చేయాలన్నారు. లద్దె పురుగు నివారణకు చర్యలు చేపట్టాలని, లేదంటే పంట దిగుబడి గణనీయంగా తగ్గే అవకాశం ఉందన్నారు. అనంతరం రైతులు సాగు చేసిన వేరుశనగ పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి గీత, రైతులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షను విజయవంతం చేయండి



'జగనన్న ఆరోగ్య సురక్ష' గురించి వివరిస్తున్న ఎంపీడీఓ

పాలసముద్రం : ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీ ప్రేమ్‌రాజ్ కుమార్, డాక్టర్ మోహన్‌కృష్ణ తెలిపారు. గురువారం ఆయన మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి నుంచి జరిగే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిస్థితి నమోదు చేయాలన్నారు. అవసరమైన వారికి పరీక్షలు నిర్వహించి, వారికి టోకెన్లు జారీ చేసి వైద్య శిబిరానికి తరలించాలన్నారు. దీనిని బయోమెట్రిక్ ద్వారా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జ్ఞానశేఖర్, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సుశీల, మురళి, ఎంఈఓ రాజేంద్రప్రసాద్, గిరిజ, మండల విస్తరణాధికారి రమేష్, ఏఎన్ఎం పాల్గొన్నారు.

దారిని అడ్డుకున్నారని.. వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన దొరస్వామిరెడ్డి

గంగాధరనెల్లూరు: ఇంటికి వెళ్లే దారిని అడ్డుకున్నారని మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలోని ఎగువ ఊరులో గురువారం చోటు చేసకుంది. పోలీసుల కథనం... ఎగువ ఊరుకు చెందిన దొరస్వామిరెడ్డి(60)కి ఇంటికి వెళ్లే దారిలో పక్కింటి రెడ్డెప్ప ఇసుకు కుప్పలు పోసి దారిలేకుండా అడ్డుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన దొరస్వామిరెడ్డి మిద్దెపై ఉన్నగదిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడికి చేరుకున్నారు. విచారణలో రెడ్డెప్ప పౌరసఫరా శాఖలో హమాలీగా పని చేస్తున్నాడని, ఇంటి వెనుక ఉన్న దొరస్వామిరెడ్డి తరచూ ఇంటికి వెళ్లేందుకు దారి లేకుండా గొడవ చేస్తున్నాడని, తల్లి దహన క్రియలు చేయకుండా కూడా అడ్డుకున్నాడని, మంగళవారం రాత్రి గ్రామ పెద్దల సమీక్షంలో రెడ్డెప్ప తీవ్రంగా దుర్భాషలాడినట్లు దొరస్వామిరెడ్డి కుమారుడు మురళీధర్‌రెడ్డి పోలీసులకు చెప్పాడు. అలాగే ఆయన మృతి చెందిన గదిలో ఉన్న సూసైడ్ నోట్‌లో తన మృతికి రెడ్డెప్పే కారణమని రాసి ఉండడంతో, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి



అబ్బాస్ అలీ(ఫైల్)

గంగాధరనెల్లూరు: గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన వేల్కూరు గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. మండల పరిధిలోని వేల్కూరు గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఎం.అబ్బాస్ అలీ(50) చిత్తూరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి విధులకు వెళ్లిన ఆయన గురువారం ఉదయం ఇంటికి చేరుకున్నాడు. కొద్దిసేపటికే గుండెపోటుకు గురై కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తుండగానే అప్పటికే మృతి చెందినట్లు గుర్తించారు. గత కొన్నాళ్ల కిందటే రోడ్డు ప్రమాదంలో అలీ కుమారుడు మాధీ(25)కూడా మరణించడంతో వారి ఇంటి విషాధచాయలు అలుముకున్నాయి.

జీరో ఎఫ్ఐఆర్‌పై అవగాహన



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా సీనియర్ సివిల్‌జడ్జి కరుణకుమార్

పెనుమూరు(కార్వేటినగరం) : జీరో ఎఫ్ఐఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహ కలిగి ఉండాలని జిల్లా సీనియర్ సివిల్‌జడ్జి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ కరుణకుమార్ అన్నారు. గురువారం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తులను, వ్యవస్థలను సమన్వయపరిచే నియంత్రణే చట్టం అన్నారు. అలాగే మండలంలోని కలవకుంట సచివాలయ పరిధిలోని విజయనగర్ ఎస్టీకాలనీ సమస్యలను హైకోర్టు వరకు తీసుకెళ్లి పరిష్కరమయ్యేలా చూస్తానన్నారు. అనంతరం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ తులసి మాట్లాడుతూ ప్రతి మహిళా ఆర్థిక శక్తిగా ఎదగాలని సూచించారు. 14 ఏళ్లలోపు పిల్లలు బడిలో ఉండేలా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ కళావతి, ఎంపీడీఓ నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ అనిల్‌కుమార్, ఏపీఎం హరికృష్ణారెడ్డి, వెలుగు సమాఖ్య సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మోహన్ (ఫైల్)

గంగాధరనెల్లూరు: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని వేపంజేరి–ముసలయ్యగారిపల్లి మార్గమధ్యలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. బుక్కాపట్టణం దళితవాడకు చెందిన నాగరాజు కుమారుడు మోహన్(22) కట్టకిందపల్లిలోని బంధువుల ఇంటికి వెళ్లి స్వగ్రామానికి బైక్‌లో వస్తున్నాడు. అయితే వేపంజేరి– ముసలయ్యగారిపల్లి మార్గమధ్యలో ప్రమాదం జరిగి ముక్కు, చెవుల్లో రక్తస్రావం అయి విగతజీవిగా పడి ఉండడాన్ని గుర్తించిన వాహన చోదకులు 108 వాహనానికి సమాచారం అందించారు. 108 వాహన సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం మోహన్‌ను చిత్తూరుకు తరలించారు. అయితే యువకుడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అయితే మోహన్ వాహనం అదుపు తప్పడంతో మృతి చెందాడా ? లేకా గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడా ? అనేది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించడంతో ఆ ప్రాంతం శోకసంద్రంగా మారింది.

బ్రాహ్మణ సమాఖ్య ఉపాధ్యక్షుడిగా రమేష్‌బాబు



పుత్తూరు రూరల్: ఉమ్మడి చిత్తూరు జిల్లా పురోహిత బ్రాహ్మణ సమాఖ్య ఉపాధ్యక్షుడిగా పుత్తూరుకు చెందిన చిట్టమూరి రమేష్‌బాబు పురోహిత్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు ఏ.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈయనకు పుత్తూరు మండల అధ్యక్షుడిగా అదనపు బాధ్యతలు అప్పగించినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు పురోహిత్ మాట్లాడుతూ పౌరోహిత్యాన్ని బ్రాహ్మణ కుల వృత్తిగా ప్రభుత్వం గుర్తించేందుకు తగిన కృషి చేస్తానని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగులకు చికిత్స అందిస్తున్న వైద్యులు



ఆరోగ్య సూచనలు చేస్తున్న వైద్యులు

నగరి : స్థానిక పెన్షనర్స్ భవనంలో గురువారం రమాదేవి హాస్పిటల్ వారు నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వందమంది రోగులు ఈ శిబిరంలో పాల్గొని వైద్యచికిత్సలు పొందారు. నరాలు, ఎముకలు, బీపీ, షుగర్ సంబంధిత వ్యాధులకు వైద్యులు శరణ్య, వినయ్ పరీక్షలు నిర్వహించారు. విచ్చేసిన వారికి ఆరోగ్యపరమైన సూచనలు, తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వైద్యసేవలకు విచ్చేసిన వారిలో 10 మంది రోగులను మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతిలోని రమాదేవి ఆస్పత్రికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఆస్పత్రి పీఆర్వో రఘునాథ్, విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు జయచంద్రుడు, ప్రధాన కార్యదర్శి బాలసుబ్రమణ్యం, సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలకు వడమాలపేట విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులతో పీఈటీ

పుత్తూరు రూరల్: అండర్–17 స్కూల్ గేమ్స్ పోటీల్లో భాగంగా యాదమరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన రెజ్లింగ్ పోటీల్లో వడమాలపేటకు చెందిన విద్యార్థులు విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ చంద్రశేఖర్‌రాజు తెలిపారు. గ్రీగో రోమన్‌కు చెందిన 48 కిలోల విభాగంలో జయసూర్య, 51 కిలోల విభాగంలో బాలాజీ, 65 కిలోల విభాగంలో ఉదయ్‌కుమార్, 110 కిలోల విభాగంలో ధనుష్‌కుమార్, ఫ్రీ స్టైల్ కేటగిరిలో యూనస్ (60 కిలోలు), మన్సూర్‌అలం(65), సూర్యతేజ(71), మనోజ్‌కుమార్(80) రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని వివరించారు. ఈ నెల 21 నుంచి 23 వరకు ఎన్టీఆర్ జిల్లా నున్న గ్రామంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరిని పాఠశాల హెచ్ఎం కరుణానవనీతం, ఉపాధ్యాయలు అభినందించారు.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

పుత్తూరు రూరల్: ప్రభుత్వం వైద్య రంగంలోనూ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని ఎంఎల్ఓ సీఎం దిలీప్‌మొదలి తెలిపారు. గురువారం పుత్తూరు రూరల్ మండల పరిధిలోని తిరుమలకుప్పం గ్రామ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడానికి ప్రభుత్వం ఇప్పటికే విలేజ్ క్లినిక్‌లను ప్రారంభించడంతో పాటు ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను ప్రవేశ పెట్టిందన్నారు. తాజాగా జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట మరో బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, తిరుమలకుప్పం, రామసముద్రం సర్పంచ్‌లు సరస, కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేష్, శ్యామ్, షణ్ముగం, బుజ్జి పాల్గొన్నారు.

సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం



లబ్ధిదారులకు పింఛన్ అందిస్తున్న గురవారెడ్డి

శ్రీరంగరాజపురం : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని నూతన పింఛన్‌దారులు అన్నారు. గురువారం మండలకేంద్రంలో కొత్తగా మంజూరైన పింఛన్లను జెడ్పీటీసీ మాజీ సభ్యులు గురవారెడ్డి పంపిణీ చేశారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ లోకేష్, వెల్ఫేర్ అసిస్టెంట్ కేశవులు పాల్గొన్నారు.



ఆళ్లమడుగులో పింఛన్‌దారులతో వైఎస్సార్‌సీపీ నాయకులు

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: అవ్వాతాతల ముఖాల్లో చిరునవ్వే సీఎం జగనన్న లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి అన్నారు. మండలంలోని ఆళ్లమడుగు,తిరుమలయ్యపల్లె గ్రామ సచివాలయంలో గ్రామ సచివాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. అదేవిధంగా కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, రామయ్య, ఎంపీటీసీ మాజీ ధనుంజయరెడ్డి, సర్పంచ్‌లు భారతి, గోవిందయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హిందీ భాషలో నైపుణ్యం సాధించాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాసులురెడ్డి

పుత్తూరు రూరల్: భారతదేశంలో అత్యధిక శాతం ప్రజలు మాట్లాడే భాష హిందీ అని, ఇందులోనూ విద్యార్థులు నైపుణ్యం సాధించాలని స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.శ్రీనివాసులురెడ్డి సూచించారు. గురువారం కళాశాలలో జాతీ య హిందీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో హిందీ విభాగం అధిపతి డాక్టర్ ఆర్‌బీ.వాణిశ్రీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఖోఖో విజేతగా గేట్‌పుత్తూరు జట్టు

పుత్తూరు రూరల్: స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో గురువారం జరిగిన ఎస్‌జీఎఫ్ పోటీల్లో అండర్–14, అండర్–17 ఖోకో పోటీల్లో గేట్‌పుత్తూరు జెడ్పీహెచ్ఎస్ జట్లు విజేతలుగా నిలిచినట్లు స్పోర్ట్స్ కోఆర్డినేటర్ గోపికృష్ణ తెలిపారు. అలాగే అండర్–14 బ్యాడ్మింటన్‌లో గొల్లపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థుల జట్టు విజేతగా నిలిచినట్లు చెప్పారు.